

డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



రూ.1.11 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెల గల కాశీ విశ్వేశ్వరరెడ్డి దంపతులు (రావుల పాలెం) రూ.1,11,116 విరాళం సమర్పించారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	22.0
కాకినాడ	35.7	24.1
అమలాపురం	36.5	25.0

న్యూస్‌రీల్

ఎస్పీ శ్రీధర్ రంజాన్ శుభాకాంక్షలు

అమలాపురం టౌన్: జిల్లాలోని ముస్లిం సోదరులకు ఎస్పీ సుసరాపు శ్రీధర్ రంజాన్ శుభాకాంక్షలను గురువారం ఉదయం తెలియజేశారు. రంజాన్ పవిత్ర మాసంలో జిల్లాలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, కఠిన ఉపవాస దీక్షలు, దాన ధర్మాలు, ఖురాన్ పఠనం, ఆధ్యాత్మిక సందేశాలతో గడిపారని ఎస్పీ శ్రీధర్ అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో ఉన్న ముస్లిం అధికారులు, సిబ్బంది కూడా రంజాన్ పండగను ఆనందంగా జరుపుకున్నారని తెలిపారు. ఈ పవిత్ర మాసంలో జిల్లాలోని మసీదుల వద్ద భద్రతా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను కూడా ఎస్పీ అభినందించారు.

త్వరలో రీజెన్సీ పునఃప్రారంభం

సంస్థ చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు



హోంమంత్రి నమశ్శివాయంతో మాట్లాడుతున్న జీఎస్ నాయుడు

యానాం: యానాంలో రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమను త్వరలోనే పునఃప్రారంభించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారం కోసం గురువారం యానాం వచ్చిన హోం మంత్రి నమశ్శివాయంను స్థానిక గాజుల గార్డెన్స్‌లో కలిసి యానాం పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధ్యయన నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జీఎస్ నాయుడు మాట్లాడుతూ తమ పరిశ్రమలో రోజుకు నాలుగు లక్షల చదరపు మీటర్ల టైల్స్ ఉత్పత్తి జరిగేదని, అలా ప్రపంచంలోనే భారీ పరిశ్రమలలో ఒకటిగా రీజెన్సీ వెలుగొందిందన్నారు. వివిధ కారణాలతో మూతపడిన రీజెన్సీని త్వరలో మళ్లీ తెరవనున్నామని, అయితే స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వల్లే ఇది సాధ్యమైందన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116 విరాళం



అంతర్వేది ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చిన దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరానికి చెందిన బి.శ్రీనివాసరావు, సత్యవేణి దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేసి, స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందుకున్నారు.

బతుకు నావ సాఫీగా..





ఐ.పోలవరం మండలం కొమానపల్లిలో జరిగిన మత్స్యకార దినోత్సవంలో చమురు సంస్థల పరిహారం ఇచ్చేందుకు వచ్చిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తదితరులు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గంగపుత్రులకు పలు రకాలుగా మేలు
- 23,458 మందికి ఓఎన్జీసీ పరిహారం
- రూ.486 కోట్ల పంపిణీ
- మత్స్యకార భరోసా ద్వారా 7,452 మందికి రూ.90.40 కోట్లు
- 769 మందికి డీజిల్ రాయితీ రూ.16.43 కోట్లు
- 666 మందికి వైఎస్సార్ మత్స్యకార బీమా రూ.58.94 లక్షలు

సాక్షి అమలాపురం: సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర సంగమ ప్రాంతం నుంచి కాట్రేనికోన మండలం మగసానితిప్ప మడ అడవుల వరకు ఉన్న విస్తారమైన సముద్ర తీరాన్ని ఆనుకుని వేలాదిమంది అగ్నికుల క్షత్రియులు జీవనోపాధి పొందుతున్నారు. సముద్ర తీరం, గోదావరి నదీపాయలలో సంప్రదాయ పద్ధతిలో ఉపాధి పొందుతున్నారు. జీవితాలను పణంగా పెట్టి కడలిలో అపార మత్స్య సంపద పొందుతున్నా వివిధ కారణాల వల్ల వారు పెద్దగా సంపాదిస్తున్నది లేదు. వీరిలో చాలా మంది పేదలే. అటువంటి మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారం పెంచడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడం, చమురు సంస్థల ద్వారా నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందజేయడం, డీజిల్ రాయితీ పెంచడం, చనిపోయిన మత్స్యకారుల కుటుంబీకులకు బీమా సొమ్ము చెల్లించడం.. ఇలా ప్రతి సందర్భంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది.

రూ.647 కోట్ల చమురు సంస్థల పరిహారం

చమురు సంస్థల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం భారీగా పరిహారం అందిస్తోంది. ప్రధానంగా జిల్లాలోని ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలతోపాటు కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలంలోని మత్స్యకారులకు అధికంగా పరిహారం అందుతోంది. గడిచిన ఐదేళ్లలో జిల్లావ్యాప్తంగా 23,458 మందికి రూ.647 కోట్లు పంపిణీ చేశారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సమయంలో స్థానిక మత్స్యకారుల వెతలు విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే చమురు సంస్థలతో చర్చలు జరిపి పరిహారం అందించారు. మొత్తం ఐదు విడతలుగా ఈ పరిహారం నేరుగా మత్స్యకారుల ఖాతాలలో డీబీటీ ద్వారా జమ చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని మండలాలతో పాటు అయినవిల్లి, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కొత్తపేట మండలాలకు చెందిన 69 గ్రామాలలోని 6,078 బోట్లకు ఈ పరిహారం అందుతోంది. లబ్ధిదారులలో 647 మంది ఒంటరి మహిళలు ఉన్నారు.

మత్స్యకార భరోసా

ఐదేళ్లలో వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా రూ.90.40 కోట్లు పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో కేవలం రూ.నాలుగు వేల చొప్పున మాత్రమే అందించేవారు. దీనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.పది వేలకు పెంచి అందిస్తున్నారు. వేట నిషేధం సమయంలో నలభై ఐదు రోజుల పాటు వందలాది మంది మత్స్యకారులు ఇళ్లకు పరిమితం కావాల్సి వస్తోంది. ఈ సమయంలో వీరికి రోజువారీ జీవనోపాధి కూడా కష్టమే.

డీజిల్ రాయితీ... మత్స్యకార బీమా

వేట బోట్లకు వినియోగించే డీజిల్‌కు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. రిజిస్టర్ అయిన మెకనైజ్డ్ బోట్లకు రాయితీ అందిస్తున్నారు. జిల్లాలోని 769 మందికి డీజిల్ రాయితీగా రూ.16.43 కోట్లు ఖర్చు చేశారు. వివిధ కారణాలతో చనిపోయిన మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార బీమాలో 666 మందికి రూ.58.94 లక్షలు పరిహారంగా అందించారు.

జీవితాంతం రుణపడి ఉంటాం



జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత మా కుటుంబాలకు పలు రకాలుగా మంచి జరిగింది. ఎంతోకాలంగా నిలిచిపోయిన ఓఎన్జీసీ నష్ట పరిహారం ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చేసిన కృషి కారణంగా మా కుటుంబానికి అందింది. ఐదేళ్లలో మా కుటుంబానికి రూ.3.75 లక్షలు అందింది. ఈ నెల 18వ తేదీన మా కుమార్తె వివాహం. ఈ నగదును వివాహానికి ఉపయోగించుకోవడం ఆనందంగా ఉంది.

– పినపోతు లక్ష్మణస్వామి, చినబొడ్డు వెంకటాయపాలెం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా

ఒక్కొక్కరికీ రూ.2.75 లక్షలు



ఓఎన్జీసీ నష్టపరిహారం మా కుటుంబంలో నలుగురికి పడింది. ఒక్కొక్కరికీ రూ.2.75 లక్షల వరకు వచ్చింది. ఈ సొమ్ముతో అప్పులు తీర్చుకోవడమే కాకుండా మా ఇద్దరు పిల్లలను కాకినాడలో ఉన్నత చదువులు చదివించుకుంటున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– తిరుమాని గోవిందరాజు, బలుసుతిప్ప, కాట్రేనికోన మండలం

నాలుగేళ్లు.. రూ.40 వేలు



వేట నిషేధం సమయంలో మాకు పూటగడవడం చాలా కష్టం. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ మాకు రూ.నాలుగు వేలు ఇచ్చే పరిహారాన్ని రూ.పది వేలకు పెంచారు. నాకు నాలుగేళ్లలో ఏడాదికి రూ.పది వేల చొప్పున రూ.40 వేలు పరిహారంగా అందింది. ఆ సొమ్ము వేట లేని సమయంలో కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి, వలల మరమ్మతులకు ఉపయోగపడింది.

– లంకే శ్రీనివాస్, మసకపల్లి, కె.గంగవరం మండలం.

కుటుంబ పోషణకు ఉపయోగపడింది



గతంలో మాకు వేట నిషేధ సమయంలో రోజులు గడవని పరిస్థితి. కాని వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇచ్చే రూ.నాలుగు వేలను జగనన్న రూ.పది వేలకు పెంచడం వల్ల మాకు కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా పోయింది. నాకు మూడుసార్లు రూ.పది వేల చొప్పున రూ.30 వేల వరకు మత్స్యకార భరోసా వచ్చింది.

– పంతాడి నరేంద్ర రాజు, కత్తిమండ, మలికిపురం మండలం

పోరాట యోధుడు పూలే



పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: బడుగు వర్గాల ఆశాజ్యోతి, అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మా జ్యోతిభా పూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం పూలే 198వ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పుష్పగుచ్ఛాలతో కలెక్టర్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల రక్షణ అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలన్నింటికీ జ్యోతిభా పూలే, అంబేడ్కర్ ఆశయాలే ఆదర్శాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ మాట్లాడుతూ జ్యోతిభాపూలే భార్య సావిత్రీ బాయి పూలే భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వై.సాంబమూర్తి, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగిరేసుపై కస్సుబుస్సులు

- కొత్త వారికే టిక్కెట్లు ఇచ్చారంటూ నిరసన సెగలు
- ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుని ముందే అరుపులు, కేకలు
- రాష్ట్ర, జిల్లా పార్టీ అధ్యక్షులు రాజీనామాలు చేయాలని నినాదాలు



పార్టీ అధిష్ఠానం తీరుపై ధ్వజమెత్తుతున్న జిల్లా పార్టీ సీనియర్ నాయకులు

అమలాపురం టౌన్: డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం స్థానికంగా ఒక హోటల్‌లో జరిగిన జిల్లా కాంగ్రెస్ సమావేశం నిరసన సెగలతో సాగింది. అతిథులుగా పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్ చౌహాన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ ఎదుటే జిల్లా పార్టీ నాయకులు అధిష్ఠానంపై ధ్వజమెత్తారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అమలాపురం, మండపేట నియోజకవర్గాలు తప్ప మిగిలిన అయిదు నియోజకవర్గాల్లో కొత్త వారికే టిక్కెట్లు ఇచ్చి ఏళ్ల తరబడి పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్లను విస్మరించారని విమర్శించారు. టిక్కెట్లు కొత్త వారికి అమ్మేసుకుని సీనియర్ నాయకులను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు సర్దిచెప్పేందుకు చేసిన ప్రయత్నాలను సైతం తిప్పికొట్టారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు గౌతమ్, పద్మశ్రీ, జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు రాజీనామాలు చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో సమావేశం గందరగోళంగా తయారైంది. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్ ఆశించిన సీనియర్ నాయకురాలు ఇసుకపట్ల రాజేశ్వరీదేవి జిల్లాలో టిక్కెట్లు ఇచ్చిన విధానాన్ని తప్పు పడుతూ ఏఐసీసీ పరిశీలకుణ్ణి నిలదీశారు. దశాబ్దాల తరబడి పార్టీలోనే ఉంటూ ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చితే ఇప్పుడు ఎన్నికల సమయంలో ఎవరో కొత్త ముఖాలకు టిక్కెట్లు ఇచ్చేస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ టిక్కెట్లు ఆశించిన ఏపీసీసీ ఎస్సీ శాఖ ఉపాధ్యక్షుడు దేవరపల్లి రాజేంద్రబాబు, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, రాష్ట్ర నాయకులు గెడ్డం సురేష్ బాబు, సత్తి బాపూజీ, జిత్తుక సత్యనారాయణ, వంటెద్దు బాబి, వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి విజయలక్ష్మి, గంటి ప్రవీణ్‌కుమార్ ఏఐసీసీ పరిశీలకుని ముందు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ అధిష్ఠానం నేతలను ఏకవచనంతో సంబోధిస్తూ జిల్లా పార్టీ నాయకులు శివాలెత్తారు. సమావేశం రసాభాసగా మారడంతో అర్ధంతరంగా ముగిసింది.

● రంజాన్ సందడి



మామిడికుదురు మసీదులో జరిగిన రంజాన్ వేడుకలో పాల్గొన్న ముస్లింలు

జిల్లాలో రంజాన్ పండగను ముస్లింలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మామిడికుదురు, నగరం, కొత్తపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. దాన ధర్మాలు చేశారు. బంధువులకు, స్నేహితులకు సేమ్యాలు పంచారు. మామిడికుదురు సున్నీ జామియా మసీదులో సాధిక్ అన్వర్ రజ్వీ రంజాన్ ప్రాధాన్యాన్ని భక్తులకు వివరించారు. – నెట్‌వర్క్

పరీక్షణ

- నేడు విడుదల కానున్న ఇంటర్ ఫలితాలు
- ఉత్కంఠలో విద్యార్థులు, విద్యాశాఖాధికారులు
- జిల్లాలో పరీక్షలు రాసిన 25,256 మంది



రాయవరం: మాధ్యమిక విద్య ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు చేపట్టింది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో మాధ్యమిక విద్యాశాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ విడుదల చేయనున్నారు. ఉన్నత విద్యకు ఉపకరించే ఇంటర్మీడియెట్ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు, అధ్యాపకులతో పాటుగా విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా ఉత్కంఠను ఎదుర్కొంటున్నాయి. గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఫలితాలను ఉమ్మడి జిల్లా పరిధిలో విడుదల చేయగా, జిల్లాల పునర్విభజన తర్వాత తొలిసారిగా జిల్లాల వారీగా ఫలితాలను విడుదల చేయనుండడం గమనార్హం.

గతేడాది అమ్మాయిలదే హవా

గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదల చేయగా, ఫలితాల్లో అమ్మాయిల హవా కన్పించింది. ఇంటర్ ఫలితాల్లో గత విద్యా సంవత్సరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫస్టియర్ ఫలితాల్లో 6వ స్థానం, సెకండియర్ ఫలితాల్లో 8వ స్థానంలో నిలిచింది. గత విద్యా సంవత్సరం విడుదలైన ఫలితాల్లో ఫస్టియర్‌లో 59 శాతం, సెకండియర్ 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 42,137 మంది ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలు రాయగా, 24,886 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 36,833 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 25,331 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్ 4,336 మంది విద్యార్థులకు 2,165 మంది ఉత్తీర్ణులు కాగా, సెకండియర్ ఒకేషనల్ విద్యార్థులు 3,791 మందికి 2,392 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ విద్యార్థులు 50 శాతం, సెకండియర్ విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో బాలుర ఉత్తీర్ణతా శాతం 55, బాలికల ఉత్తీర్ణతా శాతం 62 ఉండగా, సెకండియర్‌లో బాలుర ఉత్తీర్ణతా శాతం 64, బాలికల ఉత్తీర్ణతా శాతం 72గా ఉంది. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో బాలికల ఉత్తీర్ణతా శాతం మెరుగ్గా ఉండడం విశేషం. ఈ ఏడాది జిల్లాల వారీగా ఫలితాలు విడుదల చేయనుండడంతో ఏ జిల్లా, ఏ స్థానంలో ఉంటుంది. బాలుర, బాలికల ఉత్తీర్ణతా శాతం ఎలా ఉంటుందనే అంచనాల్లో అధికారులున్నారు.

జిల్లాల వారీగా ఫలితాలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఫలితాలను పునర్విభజన జరిగిన జిల్లాల వారీగా ప్రకటించనున్నారు. ఇప్పటికే ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని కూడా పునర్విభజన జరిగిన జిల్లాల వారీగానే నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. కోనసీమ జిల్లాలో 38 పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20,269 మంది జనరల్, 4,987 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంది. ఫస్టియర్ 13,940, సెకండియర్ 11,316 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 96శాతం మంది రాశారు.

రికార్డు స్థాయిలో తక్కువ సమయంలోనే ఫలితాలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాలను రికార్డు స్థాయిలో తక్కువ సమయంలోనే విడుదల చేసేందుకు మాధ్యమిక విద్యామండలి కృషి చేసింది. మార్చి 1న ప్రారంభమైన పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగిశాయి. పరీక్షలు పూర్తి కాకుండానే మార్చి 9నుంచే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని జిల్లాల వారీగా ప్రారంభించారు. ఏప్రిల్ 5వ తేదీతో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ముగించారు. కేవలం 28 రోజుల్లో పూర్తి స్థాయిలో స్పాట్ వాల్యుయేషన్ ముగించి, వారం రోజుల వ్యవధిలోనే ఫలితాలను విడుదల చేస్తున్నారు. ఫలితాలు ఇంత వేగంగా విడుదల కావడానికి ఇంటర్మీడియెట్ బోర్డు తీసుకున్న నిర్ణయాలు కూడా కారణం. జిల్లాల వారీగా మూల్యాంకనం చేయడం, మూల్యాంకన కేంద్రాల్లోనే స్కానర్ సహాయంతో మార్కులు నమోదు చేయడం ఫలితాలు వేగంగా విడుదలకు కారణమైంది. ఈ నెల 12వ తేదీన ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే అవకాశముందని ఈ నెల 6న 'సాక్షి' ముందే వెల్లడించింది. రికార్డు వేగంతో ఫలితాలు విడుదల చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత మూడేళ్లుగా ఇంటర్ ఫలితాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

సంవత్సరం	ఫస్టియర్	ఉత్తీర్ణులు	శాతం
2020	48,578	28,277	58.21
2022	32,890	18,895	57.00
2023	42,137	24,886	59.00
సంవత్సరం	సెకండియర్	ఉత్తీర్ణులు	శాతం
2020	49,479	25,975	57.11
2022	41,446	23,954	58.00
2023	36,835	25,330	69.00

ఫలితాలపై నమ్మకముంది



ఇంటర్ పరీక్షలను, మూల్యాంకనాన్ని పకడ్బందీగా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఇంటర్ ఫలితాలను వేగంగా విడుదల చేస్తున్నారు. ఫలితాలు త్వరగా విడుదల చేయడం విద్యార్థులకు ప్రయోజనకరం. పరీక్ష తప్పితే ఆ సబ్జెక్టుల్లో తగిన తర్ఫీదు పొందడానికి అవకాశముంటుంది. మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు తప్పినా, తక్కువ మార్కులు తిరిగి రాసుకోవడానికి అవకాశముంది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని, రాష్ట్ర స్థాయిలో జిల్లా మెరుగైన ఉత్తీర్ణత కనబరుస్తుందన్న నమ్మకం ఉంది.

– వనుము సోమశేఖరరావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, అమలాపురం

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు



డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకుని అమలాపురం డిపో నుంచి ఈ నెల 16వ తేదీ ఉదయం 8.30 నుంచి రాత్రి 7.00 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం ముగిసిన అనంతరం భద్రాచలం నుంచి తిరిగి అమలాపురం రావటానికి మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 7.00 గంటల వరకు ప్రతీ 30 నిమిషాలకు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. టికెట్లకు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు వినియోగించుకోవాలని డీఎం సత్యనారాయణమూర్తి కోరారు.

క్లుప్తంగా

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



సామర్లకోటలో రైలు ఢీ కొని మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని మూడవ నంబరు ప్లాట్‌ఫాం చివర రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం అలెప్పీ నుంచి ధన్‌బాద్ వెళుతున్న బోకారో ఎక్స్‌ప్రెస్ మూడవ నంబరు ప్లాట్‌ఫాంకు వస్తున్న సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి రైలుకు అడ్డుగా రావడంతో కుడి కాలు మోకాలు దిగువకు తెగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని లోకో పైలట్ స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు సమాచారం ఇవ్వడంతో స్టేషన్ మేనేజర్ నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే పోలీసులు విచారణ ప్రారంభించారు. రైల్వే డాక్టర్, 108 సిబ్బంది క్షతగాత్రుడిని పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు 35 సంవత్సరాల వయసు కలిగి, చామన ఛాయగా, 5'7 అడుగుల ఎత్తు ఉన్నాడని, గ్రే కలర్ ప్యాంట్, పచ్చపై తెలుపు పసుపు అడ్డు గీతలు కలిగిన హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి నల్లని కాశీ తాడు ఉందని, రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాల కోసం 94406 27562 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



కొత్తూరు సెంటర్‌లో సీజనల్ పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి



సీమచింత కాయలు, గులాబ్ జామకాయలు



రామాఫలాలు



జొన్నాడలో ఏర్పాటు చేసిన దుకాణంలో పుచ్చకాయలను విక్రయిస్తున్న వ్యాపారి

ఎండలు భగభగ.. అమ్మకాలు గబగబ

- జోరుగా సీజనల్ ఫ్రూట్స్ విక్రయాలు
- వినియోగదారుల్లో అమితాసక్తి
- వేసవిలో పెరిగిన డిమాండ్

అలమూరు: వేసవికాలం ప్రభావంతో ఎండలు భగభగ మండుతున్నాయి. ఆరోగ్యాభిలాషుల ఆదరణతో మార్కెట్‌లో ఈ సీజన్‌లో లభించే వివిధ రకాల పండ్లకు డిమాండ్ అధికమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం మండలంలోని దివాన్‌చెరువు ప్రధాన కేంద్రంగా రావులపాలెం, అమలాపురం, కాకినాడ పట్టణాల్లో ఉప కేంద్రాల్లో సీజనల్ పండ్ల వ్యాపారం చురుగ్గా జరుగుతోంది. యాపిల్, డ్రాగన్, చెర్రీ, దానిమ్మ, ద్రాక్ష, కమలా ఫలాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానిక చిరు వ్యాపారులు ఆయా పట్టణాల్లోని హోల్‌సేల్ వర్తకుల నుంచి కొనుగోలు చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు రెండు టన్నుల మేర పండ్ల అమ్మకాలు సాగుతుండగా రూ.కోట్లలో టర్నోవర్ లభిస్తోంది. సీజన్‌లో మాత్రమే లభించే పుచ్చకాయ, సపోటా, రామాఫలం, గులాబీ జామ, చీమ చింతకాయలు, దోసకాయలు తదితర పండ్ల కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. శరీర దారుఢ్యానికి, ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్న వినియోగదారులు ఈ పండ్లను ధర ఎక్కువైనా కొనుగోలు చేసేందుకు వెనుకాడటం లేదు.

పోటెత్తిన పుచ్చకాయలు

వేసవిలో ఎక్కువగా తినే పుచ్చకాయలు మార్కెట్‌లోకి ఇప్పటికే పోటెత్తాయి. రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా ఈ దుకాణాలే కనిపిస్తున్నాయి. రంపచోడవరం, గోకవరం, ఏలేశ్వరం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో లభ్యమయ్యే రామాఫలాలను వ్యాపారులు తీసుకువస్తున్నారు. ఎరుపు, పసుపు రంగుల కలయికలో ఉండే రామాఫలంలో గుంజు మాత్రం సీతాఫలంలానే ఉన్నప్పటికీ పిండి పదార్థం ఎక్కువగా ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరమైన విటమిన్లు ఉండటంతో పాటు తియ్యగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే దొరికే వీటిని సైజును బట్టి డజను రూ.250 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని లంక భూముల్లోను, చాగల్నాడు ప్రాంతాల నుంచి సీమ చింతకాయలు తీసుకువచ్చి కిలో రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వీటికి మార్కెట్‌లో ప్రత్యేకమైన డిమాండ్ ఉంది. గోదావరి లంకల్లో ఈ సీజన్‌లో పండే దోసకాయలు, సపోటాలకు గిరాకీ ఉంది. సైజును బట్టి కాయ ఖరీదు రూ.40 నుంచి రూ.100 వరకు ఉంటుంది. చలువ చేసే వీటిని పంచదారలో కలుపుకుని తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. లంకల్లో దొరికే ఖర్బూజాలు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ. 30 వరకు ఉంటున్నాయి. కడియం ప్రాంతంలో దొరికే గులాబ్‌జామకాయలు డజను రూ.50 వరకు ఉంటున్నాయి. విజయనగరం, మన్యంలోని అల్లూరి జిల్లా నుంచి వచ్చే అనాస పండ్లు అతిచౌకగా లభిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోనూ విక్రయాలు

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో మాత్రమే లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ గ్రామీణ ప్రాంతాల్లోను లభ్య మవుతున్నాయి. సీజనల్‌గా దొరికే ఆయా రకాల పండ్లను నేరుగా పండించే ప్రాంతానికి వెళ్లి, కొనుగోలు చేసి సైకిళ్లపైనా తిరుగుతూ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. అరుదుగా లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ ఇంటి ముంగిటే లభ్యకావడంతో గ్రామీణప్రాంత వాసులు సంబరపడుతున్నారు. స్థానికంగా లభించే కొన్ని పండ్లను కోసుకుని తింటే ఉండే మజా వేరనే అభిప్రాయాన్ని గ్రామీణులు వ్యక్తం చేస్తుంటారు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అమితంగా ఉండి ఆరోగ్యానికి దోహదపడే సీజనల్ ఫ్రూట్స్‌పై అన్ని ప్రాంతాల వాసుల్లో ఆదరణ పెరుగుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూర, అంజీర తదితర డ్రైఫ్రూట్స్‌కు సీజన్‌తో నిమిత్తం లేకుండా విశేష ఆదరణ లభిస్తోంది.

పెరిగిన గిరాకీ



సీజనల్‌గా లభించే పండ్లను కొనుగోలు చేసేదుందుకు వినియోగదారులు అమితంగా ఇష్టపడుతున్నారు. సంవత్సరానికి కొన్ని రోజుల పాటు లభించే ఈ పండ్లు ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే వేసవిలో సీజనల్ ఫ్రూట్స్ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

– కాకి సత్యనారాయణ, పండ్ల వ్యాపారి, పినపళ్ల

భలే రుచి



సాధారణంగా వేసవి ప్రారంభంలో లభ్యమయ్యే సీజనల్ పండ్లు అత్యంత రుచికంగా ఉంటాయి. ఆరోగ్య సంరక్షణకు పండ్ల ధరలు ఎక్కువైనా కొనుగోలు చేయక తప్పడం లేదు.

– చిన్నం సత్యనారాయణ, వినియోగదారుడు, ఆలమూరు.

ఆరోగ్యానికి మంచివి



వేసవిలో లభించే సీజనల్ ఫ్రూట్స్‌లో అనేక పోషక విలువలు ఉంటాయి. వీటిని పరిమితంగా తీసుకుంటే మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతుంది. వేసవి దృష్ట్యా ఫ్రూట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఆర్.మల్లికార్జున్, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల

వైఎస్సార్ సీపీకి రెడ్డి సామాజిక వర్గం అండ

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు అవకాశవాద రాజకీయాలు అలవాటేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక అధికారం కోసం బీజేపీ, జనసేనతో అనైతిక పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. రెడ్డి వ్యతిరేకి చంద్రబాబు అని, టీడీపీ హయాంలో రెడ్లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గీయులను ద్వేషించే చంద్రబాబు తాను అధికారంలో ఉండగా తన సామాజిక వర్గం వారిని ప్రాధాన్యం కలిగిన ప్రభుత్వశాఖల్లో నియమించారన్నారు. ప్రాధాన్యం లేని పోస్టుల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించారని, ఇది నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉండగా రెడ్లను అన్ని రంగాల్లో అణిచివేసిందని, కాల్‌మనీ వ్యవహారంలో రెడ్డి సామాజిక వర్గీయులనే టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలిచారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, ఈ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గీయులు ప్రత్యేక పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, వల్లభశెట్టి సతీష్, జీవీఎల్ రవిశంకర్, కొండేటి భీమేష్ పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవాలపై సమీక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్నట్టు దేవాదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవాలపై సమీక్ష ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

మా స్కూల్.. మా రూల్!

- జనసేన నేత పాఠశాలలో నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు



గొల్లప్రోలులో మాధురి పబ్లిక్ స్కూలు

గొల్లప్రోలు: నగర పంచాయతీలోని మాధురి ప్రైవేటు స్కూల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం రంజాన్ సెలవును గురువారం ప్రకటిస్తే బుధవారం ఆ స్కూల్‌కు సెలవు ఇచ్చేసి ఆరోజు జరపాల్సిన పరీక్షను వాయిదా వేసేశారు. తిరిగి రెండో రోజు గురువారం పరీక్ష నిర్వహించకుండా సెలవు ప్రకటించారు. ఎవరి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలకు సెలవు ప్రకటించి పరీక్షలు వాయిదా వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్కూల్ యజమాని కడారి తమ్మయ్యనాయుడు జనసేన నేత కావడంతోనే అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ 6వ తేదీ నుంచి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీసీఈబీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ జారీ చేసిన టైం టేబుల్ ప్రకారం బుధవారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో బుధవారం ఈ పరీక్ష నిర్వహించారు. మండల వనరుల కేంద్రం నుంచి డీసీఈబీ పరీక్షల పేపర్లు మాధురి స్కూల్ సిబ్బంది తీసుకొని వెళ్లినట్టు ఎమ్మార్సీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. యాజమాన్యం శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించనున్నట్లు చెబుతోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్ష పేపర్లతో యాజమాన్యం పరీక్షలు నిర్వహిస్తోందా లేదా.. అనే అనుమానం విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజు క్రితమే అన్ని పాఠశాలల్లో రాసేసిన పేపర్లతో మూడవ రోజు పరీక్షలు రాయిస్తే ఇక అది పరీక్ష ఎలా అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. విషయమై డీవైఈవో ఆర్‌జేడీ రాజు వివరణ కోరగా మాధురి స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదు చేశామన్నారు. అలసత్వం వహించిన గొల్లప్రోలు మండల విద్యాశాఖాధికారులపైనా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

దిండి టూరిజం కేంద్రం స్కాంలో ఐదుగురి సస్పెన్షన్

మలికిపురం: ప్రముఖ పర్యాటక కేంద్రం దిండి టూరిజం కేంద్రంలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఐదుగురు ఉద్యోగులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మేనేజరు ఫణీంద్రతో పాటు ఉద్యోగులు పసుపులేటి సత్యనారాయణ, పుల్లారావు, రాజు, దుర్గారావులను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నాటక రంగానికి సీఆర్‌సీ ప్రోత్సాహం ఎనలేనిది

చివరి రోజు ఆకట్టుకున్న నాటికలు



మూడో రోజు నాటికలను ప్రారంభిస్తున్న సినీనటుడు తనికెళ్ల భరణి, డైరెక్టర్ అజయ్ భూపతి తదితరులు



ఇంద్రప్రస్థం నాటికలో ఒక సన్నివేశం

రావులపాలెం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందిచాలనే సంకల్పంతో కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ) ఆధ్వర్యంలో నాటక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేదని పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు తనికెళ్ల భరణి, సినీ డైరెక్టర్ అజయ్‌భూపతి, పారిశ్రామిక వేత్త చింతా రామకృష్ణారెడ్డిలు అన్నారు. సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 24వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. మూడో రోజు నాటికలను వారు ప్రారంభించారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం నాటికకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించగా రచన శ్రీసిద్ధ, సంగీతం శ్రీ లీలామోహన్, ఆహార్యం పచ్చల శేషగిరి, రంగాలకరణ శివరామకృష్ణ వహించారు. విజయవాడ మైత్రి కళానిలయం వారి బంధం నాటికను టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించగా రచన మూడుగుల రామకృష్ణ, సంగీతం శ్రీ లీలా మోహన్, నిర్వహణ పీబీ కుమార్, రంగాలంకరణ పిఠాపురం బాబూరావు వహించారు. రావులపాలెం సీఆర్‌సీ వారి ప్రత్యేక ప్రదర్శన కృష్ణాంజనేయం నాటిక రచన సీఆర్‌సీ రూపశిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి, నాటకీకరణ, దర్శకత్వం గంటా రామమోహన్‌రావు నిర్వహించారు. చివరి రోజు నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ పలివెల త్రిమూర్తులు, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పర్యవేక్షించారు.

కోడ్ ఉల్లంఘించారని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లిపై ఫిర్యాదు



ఏఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి గురువారం ఏఆర్‌ఓ సునీల్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి అసెంబ్లీ సీటు దక్కకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి అంటూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. రామకృష్ణారెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు, దూషణలు చేస్తున్నారన్నారు. ఆయనే స్వయంగా మాట్లాడిన ఆడియోతో తన ఎన్నికల ప్రచారానికి అనుమతి పొందిన వాహనాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే పరిస్థితి లేదన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సునీల్‌బాబుకు ఫిర్యాదు చేసినట్లు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఏఆర్‌ఓను కలిసిన వారిలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్ తదితరులు ఉన్నారు.

అరుదైన చేప.. ఎగరడమే చేవ!



కాకినాడలో తూనీగ చేప



చేప పొడవాటి రెక్కలను చూపుతున్న మత్స్యకారుడు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలోని చేప పేరు తూనీగ.. ఈ చేప ప్రత్యేక ఏమిటంటే సముద్రపు నీటిలో ఈద గలదు. గాలిలో ఎగర గలదు. ఈ చేపలు గుంపులుగా సముద్రంలో ఎగురుతూ వెళుతుంటే నయనానందకరమే. నీటి పై నుంచి గాలిలో చాలాదూ రం ఎగరడంతో ఈ చేపలను తూనీగ అని పిలుస్తా రని మత్స్యకారులు చెబుతారు. గాల్లో ఎగిరేందుకు అనుగుణంగా వీటి రెక్కలు పొడవుగా ఉంటాయి.